తాయి. కేసీఆర్ నాయకుడిగా కంటే రైతుగానే సీనియర్. రైతు కుటుంబంలో పుట్టారు. పొలాల మధ్య పెరిగారు. సేద్యం చేశారు. ఓ దశలో తీవ్రమైన కూలీల కొరత. కారు మేఘాలు కమ్ముకొస్తున్న పరిస్థితి. వీలైనంత వేగంగా కోతలు జరిగిపోవాలి. లేకపోతే తీవ్ర నష్టం తప్పదు. ఆ సమయంలో కేసీఆర్.. సమష్టి సేద్యాన్ని పరిచయం చేశారు. కూలీల కోసం ఆధారపడకుండా.. అందరూ కలిసి, అందరి పొలాల్లో కోతలకు వెళ్తే రెండుమూడు రోజుల్లో ఒడ్డున పడతామని సలహా ఇచ్చారు. అంతా అంగీకరించారు. మూకుమ్మడిగా ఓ గండం గట్టెక్కారు. హాలికుడైన నాయకుడికే ఇలాంటి ఆలోచనలు వస్తాయి. ఇప్పటికీ అంతే. వ్యవసాయ క్షేత్రానికి, ప్రజా క్షేత్రానికి సమ ప్రాధాన్యం ఇస్తారాయన.

**దటీజ్.. కేసీఆర్!**

**సామాన్యులకు ..సామాన్యుడే!**

అనర్గళంగా ఆంగ్లంలో సంభాషించగలరు. ముషాయిరా కవులు సైతం ముక్కున వేలేసుకునేలా ఉర్దూలో మాట్లాడగలరు. ఇక, తెలుగు భాష ఉగ్గు పాలతోనే అబ్బింది. నన్నయ నుంచి నారాయణ రెడ్డి వరకు తెలియని కవి లేరు. చదవని రచన లేదు. కానీ, సామాన్యులతో సంభాషిస్తున్నప్పుడు, వేదికల మీద ఉపన్యసిస్తున్నప్పుడు అచ్చమైన మట్టిభాషనే ఎంచుకుంటారు. రచ్చబండ మీద పెద్దమనిషి ముచ్చట్లు పెట్టినట్టే ఉంటుంది. ప్రతి మాట వెనుకా ఓ సామెత, పిట్టకథ. కాబట్టే, ఆన్‌లైన్‌లో ఆ వీడియోలు అంత వేగంగా వైరల్ అవుతాయి. దెబ్బకు ప్రతిపక్షాలకు వైరల్ ఫీవర్ వచ్చేస్తుంది. జనం భాషలో మాట్లాడుతూ జనంతో మమేకం అవుతారు. అందుకే, గ్రామీణులు ఆయనను పెద్దన్నలానో, పెద్ద కొడుకులానో చూస్తారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కరెంటు కోతలకు నిరసనగా కేసీఆర్ రహదారి దిగ్బంధానికి పిలుపునిచ్చారు. సిద్దిపేట సమీపంలో తానూ రోడ్డెక్కారు. తండోపతండాలుగా జనం వచ్చారు. అందులోనూ మహిళలే ఎక్కువ. ఓ పెద్దమ్మ అయితే కేసీఆర్ భుజం మీద చెయ్యేసి 'ఇగ అటే పోతవా? కనబడుడే లేదు. ఇటాంకల వచ్చుడే కరువైంది. మా గోసెవలు సూడాలె' అంటూ ఆత్మీయంగా పలకరించింది. ఆ దృశ్యాన్ని చూసి 'ఒక రాజకీయ నాయకుడితో ప్రజలు ఇంతగా మమేకం కావడమా?' అని ఆశ్చర్య పోయారట జయశంకర్ సార్. ప్రగతి భవన్ కావచ్చు, ప్రచార వాహనం కావచ్చు. భోజన సమయానికి ఎవరున్నా.. పక్కన కూర్చోబెట్టుకోవాల్సిందే. కొసరి కొసరి వడ్డించాల్సిందే. ఏ కూరలో ఏ పచ్చడి నంజుకోవాలో చెప్పిచెప్పి తినిపించాల్సిందే. 'అన్నపూర్ణకు సుద్దియా అతని ఇల్లాలు' అన్నట్టు అతిథి సేవలో నాలుగక్షరాలు ఎక్కువే చదివిన దొడ్డ ఇల్లాలు శోభమ్మ. ఫామ్ హౌస్‌లో అయితే.. ప్రతి చెట్టూ ఆయనకు ఎరుకే. ప్రతి పశువుతోనూ ఆయనకు స్నేహమే. వ్యవసాయ కూలీలు, పక్క పొలాల రైతులను పేరు పెట్టి పిలుస్తారు. మంచి చెడ్డలు మాట్లాడతారు. ఇరుగుపొరుగు పొలాలు సందర్శిస్తారు. రైతులతో ముచ్చట్లు పెడతారు. ఆ సమయానికి ఆయన అచ్చమైన మట్టిమనిషి. సామాన్య రైతు.

**దటీజ్.. కేసీఆర్!**



**నర్సరీలు**

గ్రామాల్లో పచ్చదనం పెంచడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పల్లెప్రకృతి వనం ఏర్పాటుకు రూ.5 లక్షలు నిధులు సహా గ్రీన్‌బడ్జెట్ కింద పంచాయతీ నిధుల్లో పది శాతం, నరేగా నిధులు అందుబాటులో ఉన్నాయి. అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు ప్రతీ పల్లె పచ్చదనంతో అలరారుతున్నది. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి. పచ్చదనమే మన భవిష్యత్తు అని గ్రహించాలి.

**పదికాలాలు పచ్చగా.. రేపటి తరాలు మెచ్చగా**

నాయకుడు దీర్ఘదర్శి కావాలి. మూడు తరాల ముందుకెళ్లి ఆలోచించాలి. బహుళ అంతస్తుల భవనాలు, కాంక్రీట్ కట్టడాలే అభివృద్ధి కాదు. చెరువుల్ని కాపాడుకోవాలి. అడవుల్ని నిలబెట్టుకోవాలి. పచ్చదనాన్ని రక్షించాలి. ఈ దీర్ఘకాలిక దృక్కోణం కేసీఆర్ లాంటి అతికొద్దిమంది నాయకులకే ఉంటుంది. కాబట్టే, రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణలో పచ్చదనం పెరిగింది. 'సమ్ పీపుల్ ఫీల్ ద రెయిన్. అదర్స్ జస్ట్ గెట్ వెట్' అంటారు బాబ్ మార్లీ అనే రచయిత. కొందరు వర్షంలో తడుస్తారు. మరికొందరు వర్షాన్ని ఆస్వాదిస్తారు. కొందరికి చెట్టు చెట్టులానే కనిపిస్తుంది. అరుదైన వ్యక్తులకు అందులో భవిష్యత్తు గోచరిస్తుంది. పాత పాలకులకు ఆ హరిత దృష్టి లేకపోవడం వల్లే.. ఢిల్లీ నగరం నరకకూపంలా మారింది. జీవం నిలబెట్టాల్సిన ప్రాణవాయువు.. ప్రాణాంతకమైన కాలుష్యాన్ని పంచుతున్నది. ఆ దుస్థితి మనవరకూ రాకూడదన్న ఆరాటమే హరిత హారానికి జీవం పోసింది. అడవి నగరానికి కూడా విస్తరించాలన్నది ఆయన సంకల్పం. పల్లెల్లో బడి, గుడితోపాటు నర్సరీ కనిపించాలంటారు. దాదాపు పందొమ్మిదేండ్ల క్రితమే సిద్దిపేటలో పది నిమిషాల్లో పదివేల మొక్కలు నాటించి రికార్డు సృష్టించారు. 'ఈ అడవి ఎవరిదో కాదు. మనది. చిన్నప్పుడు రకరకాల పండ్ల చెట్లు ఉండె. మనం తినే పండ్లు వేరే ఉంటయి. కోతులు, ఇతర పక్షులు తినేవి వేరే ఉంటయి. కోతులు అడవిలే తినేవి. ఏర్ల నీళ్లు తాగి మంచిగ బతికేవి. అవన్నీ మనం నాశనం చేసినం. అవి వచ్చి మన పంటల్ని నాశనం చేస్తున్నయి' అంటూ ఇప్పటికే మొదలైన అపసవ్య ధోరణి గురించి హెచ్చరిస్తారు. జీవ వైవిధ్యం గురించి చెబుతూ 'పర్యావరణ సమతుల్యత లేకపోతే మనిషి జీవించే పరిస్థితే ఉండదు. మన వరకూ ఫర్వాలేదు. ముందుతరాలు మాత్రం చాలా కష్టాలను అనుభవించాల్సి ఉంటుంది. పచ్చదనమే దీనికి పరిష్కారం' అని హితవు చెబుతారు. సమాజంలో రెండురకాల నాయకులు ఉంటారు. ధనాన్ని ప్రేమించేవారు, పచ్చదనాన్ని ప్రేమించేవారు. మన సీఎం రెండో కోవలోకి వస్తారు.

**దటీజ్.. కేసీఆర్!**

**వరి ఉత్పత్తి**

రాష్ట్రంలో పంట ఇసుక పండినట్టు పండుతున్నది. ఇప్పుడు రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల టన్నులతో పంజాబ్‌ను దాటిపోయింది. త్వరలోనే 4 కోట్ల టన్నులకు పెరగనుంది. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొని, ఐదారు రోజుల్లో బ్యాంక్ ఖాతాలకు డబ్బులు పంపిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే! నాడు తెలంగాణలో 7 లక్షల టన్నులు వినియోగమయ్యే యూరియా ఇప్పుడు 28 లక్షల టన్నులకు పెరిగింది.

